

### ప్రత్యేక చట్టం తీసుకురావాలి

వైద్యవృత్తిలో ఉండే మహిళా వైద్యులు నిర్భయంగా విధులు నిర్వర్తించేందుకు వీలుగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. మహిళా వైద్యులు, నర్సులు రాత్రి సమయాల్లో ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలి. కోల్‌కతా హత్యాచార ఘటన తలుచుకుంటేనే భయమేస్తోంది. ప్రభుత్వాలు రాష్ట్రంలోని మహిళా డాక్టర్లు ధైర్యంగా విధులు నిర్వర్తించే పరిస్థితిని కల్పించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి.

– డాక్టర్ కదలి రమాదేవి, మధుమేహ వైద్య నిపుణురాలు, అమలాపురం



### పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనతో మహిళా వైద్యులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. జిల్లా బోధన ఆస్పత్రుల వద్ద అవుట్ పోస్ట్‌ల తరహాలోనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల వద్ద కూడా నెలకొల్పాలి. ఆస్పత్రుల వద్ద కనీసం ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను ముఖ్యంగా నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులు, నర్సులకు రక్షణగా ఉంచాలి. దీనివల్ల మహిళా డాక్టర్లకు రాత్రి సమయంలో విధులు నిర్వర్తించాలంటే భయం పోతుంది.

– డాక్టర్ గంధం రామం, విశ్రాంత సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

# అటకెక్కిన పట్టణ సుందరీకరణ

- అమలాపురం పట్టణ సుందరీకరణపై దృష్టి సారించని నేతలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.45 లక్షల నిధుల మంజూరు
- అయినా మరుగున పడిన హరిత నగరం అభివృద్ధి



అమలాపురం పట్టణం ప్రధాన రోడ్ల మధ్యలో సుందరీకరణకు నోచుకోని డివైడర్లు

**అమలాపురం టౌన్:** అమలాపురం పట్టణ సుందరీకరణ అంశం అటకెక్కింది. గత ప్రభుత్వంలో జగనన్న హరిత నగరం పేరుతో పట్టణ సుందీరకణకు రూ.45 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయినా అధిక టెండర్ల పేరుతో గతేడాది జరిగిన ఓ కౌన్సిల్ సమావేశంలో ఆ అంశాన్ని వాయిదా వేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా పట్టణ సుందరీకరణ ఊసే ఎత్తడం లేదు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపాలిటీల ప్రగతికి ఏవేవో ప్రకటనలు చేస్తున్నా గత ప్రభుత్వంలో హరిత నగరాల అభివృద్ధి విషయం గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.

**పట్టాలెక్కని ప్రతిపాదనలు**

అమలాపురం పట్టణంలోని ప్రధాన రోడ్ల మధ్యలో దాదాపు కిలోమీటరుకు పైగా డివైడర్లు ఉన్నాయి. కనీసం డివైడర్లలో పచ్చదనాన్ని నింపి సుందరీకరించే ప్రయత్నాలు సైతం చేయడం లేదు. గత ప్రభుత్వంలో జగనన్న హరిత నగరం పేరుతో పట్టణ సుందరీకరణకు మంజూరైన రూ.45 లక్షలతో అప్పటి కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిల్ పట్టణాన్ని అన్ని విధాల పచ్చదనంతో డివైడర్లను అభివృద్ధి చేసేందుకు, పరిసరాలన్నీ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపే దిశగా అప్పట్లో టెండర్లు పిలిచారు. అజెండాలోని ఆ అంశం వాయిదా పడడంతో తాత్కాలికంగా బ్రేకులు పడడం, తర్వాత సార్వత్రిక ఎన్నికల వేడి అందుకోవడం వంటి పరిణామాలతో హరిత నగరం అభివృద్ధి మరుగున పడింది. ఈ పథకం ద్వారా డివైడర్లు, పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కాకుండా రోడ్ల చెంత పచ్చని మొక్కలు, వాటి గార్డులు, రోడ్ల వెంబడి గోడలపై పచ్చదనంతో కూడిన ఆహ్లాదభరితమైన బొమ్మలను వేయించడం, పచ్చదనం నినాదాలు రాయడం వంటి అభివృద్ధికి సంబంధించి పనుల ఎంపిక ప్రక్రియ కూడా అప్పట్లో పూర్తయింది.

**కానరాని అభివృద్ధి**

టీడీపీ వార్డు కౌన్సిలర్ పరిధిలో ఉన్న తామర చెరువు ఆరోగ్య ఉద్యాన వనం(పార్కు) మాత్రమే అన్ని విధాలా అభివృద్ధి చెందింది. కాటన్ పార్కు నిర్వహణను మున్సిపాలిటీ దాదాపు వదిలేసింది. వాటర్ వర్క్స్ వద్ద గల పార్కులోనూ ఇటీవల కాలంలో సందర్శకులు అసౌకర్యాలను చవి చూస్తున్నారు. ఇక హౌసింగ్ బోర్డు కాలనీ, సావరం, కౌండిన్యనగర్‌లో ఉన్న చిన్న పార్కుల విషయంలో కూడా అభివృద్ధి కానరావడం లేదు. గత ప్రభుత్వంలో హరిత నగరం కోసం మంజూరైన రూ.45 లక్షలతో అమలాపురం పట్టణాన్ని సుందరీకరించే ప్రతిపాదనలను అటకెక్కించే యోచనలో కొందరు నేతలు ఉన్నట్లుగా మున్సిపాలిటీలో చర్చ సాగుతోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా పర్యావరణ అభివృద్ధి దిశగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, కొన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించినా అందులో మున్సిపాలిటీల పేర్ల ప్రస్తావన లేదు. ఈనెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్న పిలుపునకే ఆయన పరిమితమయ్యారు.

### సావరం పార్కుకు నిధుల మంజూరు



స్థానిక 28వ వార్డులో సావరం వద్ద గల మున్సిపల్ పార్కు గ్రీనరీ అభివృద్ధికి ఇటీవల కాలంలో నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఈ పార్కు గ్రీనరీ పనులు చేపడతాం. గతంలో హరిత నగరం కోసం నిర్వహించిన టెండర్లపై ఆరోపణలతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి.

– ఎస్.మనోహర్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

### ర్యాంకుల జాబితా విడుదల

**యానాం:** నీట్ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్, పీఏఎంఎస్, పీవీఎస్‌సీ కోర్సులకు సంబంధించిన ర్యాంకుల జాబితాను ఆదివారం సెంటాక్ విడుదల చేసింది. ఈ మేరకు సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కోటా, మేనేజ్‌మెంట్, తెలుగు మైనారిటీ అండ్ క్రిస్టియన్ మైనారిటీ, ఎన్ఆర్ఐ కోటా, స్పోర్ట్స్ కోటాకు సంబంధించి డ్రాఫ్ట్ ర్యాంకుల జాబితాను విడుదల చేశామన్నారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26లోగా సెంటాక్‌కు ఎస్ఎంఎస్ పెట్టాలని విద్యార్థులకు సూచించారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నెంబరు 0413–2655570, 2655571కు ఫోన్ చేయాలన్నారు. కోర్సుల ఎంపిక దరఖాస్తును నింపకపోతే అలాంటివారికి సీటు కేటాయించరన్నారు.

### సేవాపత్రం గ్రహీతకు ఘన సత్కారం



అంబాజీపేటలో సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, స్థానికులు

**అంబాజీపేట:** దేశ సేవకి మించిన సేవ మరొకటి లేదని, దేశానికి సేవలందించే భాగ్యం కలగడం అదృష్టంగా భావించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఒడిశా–ఛత్తీస్‌ఘడ్ బోర్డర్ కమాండోగా విధులు నిర్వహిస్తున్న మట్టపర్తి సుబ్రహ్మణ్యంను పలువురు అభినందించారు. స్థానిక బస్‌స్టేషన్ సమీపంలో జీఎస్ఆర్ లే అవుట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొని ప్రసంగించారు. సుబ్రమణ్యం 2013 నుంచి గ్రేహౌండ్స్ వైజాగ్ విభాగంలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రతిభా పాటవాలు కనబర్చి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంటరీ అవార్డు రావటం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. సుబ్రహ్మణ్యం దేశానికి అందిస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సురక్ష సేవాపత్రం అందుకున్నారు. అనంతరం సుబ్రహ్మణ్యంను స్నేహితులు, బంధువులు, స్థానికులు కొర్లపాటి గోపి, దొమ్మేటి సత్యమోహన్, ఘనంగా సత్కరించారు.

## క్లుప్తంగా

### దోషులను కఠినంగా శిక్షించాలి



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న యువత, నేతలు

**అమలాపురం టౌన్:** బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడే దోషులను కఠినంగా శిక్షించాలని నినదిస్తూ అమలాపురంలో కొందరు యువతీయువకులు ఆదివారం వినూత్న నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్, పార్టీ జిల్లా ఐటీ విభాగం కార్యదర్శి కొల్లు గౌతమ్ నాయకత్వంలో ఈ ర్యాలీ జరిగింది. తొలుత హైస్కూలు సెంటరు నుంచి పాదయాత్రగా ర్యాలీ నిర్వహించి గడియారం స్తంభం సెంటరులో నినాదాలు రాసిన బ్యానర్లు, ఫ్లెక్సీలతో ప్రదర్శన జరిపారు. కోల్‌కతా ఘటనలో మరణించిన మహిళా వైద్యురాలి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లు గౌతమ్, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

### పడిపోయిన విద్యుత్ స్తంభం



పేరూరు ఇందిరానగర్ కాలనీలో పడిపోయిన విద్యుత్ స్తంభం

**అమలాపురం రూరల్:** మండలంలోని పేరూరు గ్రామ పరిధి ఇందిరా నగర్ కాలనీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభం పడిపోయింది. దీంతో పది నివాస గృహాలకు విద్యుత్ నిలిచిపోయింది. గత రెండు రోజులుగా అంధకారంలోనే మగ్గుతున్నామని, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని స్థానికులు మండిపడితున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

### అభ్యర్థులకు వయో పరిమితిని పెంచాలి

**యానాం:** ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగ అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలని మాజీ ఎంపీ రామదాస్ డిమాండ్ చేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం అనేక ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లను విడుదల చేస్తుందన్నారు. ఇప్పటికే 1,000 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు 15 శాఖలకు చెందిన బీఅండ్‌సీ కేటగిరి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిందన్నారు. అన్ని పోస్టులకు కనీస వయోపరిమితిని 30 ఏళ్లుగా పేర్కొన్నారని, ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు వయోపరిమితి సడలిస్తున్నారన్నారు. అయితే ఎన్నికల నేపథ్యంలో వయోపరిమితి సడలింపునకు హామీ ఇచ్చారని, దాన్ని అమలుచేయాలని కోరారు. అండమాన్ నికోబార్ దీవుల్లో వయోపరిమితి ఇచ్చినప్పుడు పుదుచ్చేరిలో ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**ఉప్పలగుప్తం:** కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని స్థానిక గ్రామంలో ఉన్న మహిళా స్వయం శక్తి భవనంలో వెలుగు ఏపీవో ఎ.సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలతో కలిసి లఖ్‌పతి దీదీ అంశంపై డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, దేశంశెట్టి లక్ష్మీ నారాయణ, చిక్కం సూర్యమోహన్, సీసీ సత్య తదితరులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్ట్

**తాళ్లరేవు:** మండలంలోని నీలపల్లి గ్రామ పంచాయతీలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు స్థానిక చేపల మార్కెట్ సమీపంలో కొందరు పేకాట ఆడుతుండగా అందిన సమాచారం మేరకు దాడిచేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

### బీకే మండల్ జయంతి

**మలికిపురం:** బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీకే మండల్ జయంతిని ఆదివారం మలికిపురంలోని పూలే–అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీ భాస్కరరావు, కోళ్ళ వేణు, నల్లి శివకుమార్, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# గోతులే దారి చూపిస్తాయి

అల్లవరంలో అధ్వానంగా తయారైన ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం



అల్లవరం ఆస్పత్రి వద్ద గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

**అల్లవరం:** రెండు దశాబ్దాల క్రితం అల్లవరానికి చెందిన నడింపల్లి సూర్యనారాయణరాజు రెండెకరాల భూమిని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు విరాళంగా ఇచ్చారు. సదరు భూమిలో అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, మహిళా సమాఖ్య, అల్లవరం సచివాలయం–2, గ్రంథాలయం, రైతు భరోసా కేంద్రం, సచివాలయం–1 ప్రభుత్వ భవనాలను నిర్మించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి ఉన్న ఏకైక గ్రావెల్ రోడ్డులో అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. ఆయా కార్యాలయాలకు ఎంతోమంది మండల స్థాయి అధికారులు వచ్చారు.. వెళ్లారే తప్ప అక్కడ సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో సార్వత్రిక ఎన్నికల ముందు రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైను నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కాని నేటికీ పనులు ప్రారంభించలేదు. అల్లవరం సీహెచ్‌సీకి రోజూ వందల మంది రోగులు వస్తుంటారు. వీరే కాకుండా వివిధ పనుల నిమిత్తం ఎంతో మంది ప్రభుత్వ కార్యాలయాలకూ వస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే వారందరి బాధ వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డుని ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని వివరణ కోరగా గతంలో ఉపాధి హామీ నిధులు రూ.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల కారణంగా నిధులు మంజూరు కాలేదన్నారు. మండల పరిషత్ నిధులతో మరమ్మతులు చేపడతామని తెలిపారు.

# కృష్ణుడు, లక్ష్మీదేవి చిత్రాలతో యూరోపియన్ నాణెం



**అమలాపురం టౌన్:** యూరోపియన్ దేశం ఆస్ట్రియా ముద్రించి విడుదల చేసిన కృష్ణుడు, లక్ష్మీదేవి చిత్రాలతో 100 యూరోల బంగారు నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. నాణేనికి ఒక వైపు చుట్టూ నెమలి పింఛాలతో ఉన్న లలితాసనంలో కూర్చున్న కృష్ణుని చిత్రాన్ని ముద్రించారు. మరోవైపు చుట్టూ ఏనుగులు ఉండి మధ్యలో కమలంపై కూర్చుని ఉన్న లక్ష్మీదేవి చిత్రాన్ని ముద్రించారు. లక్ష్మీదేవి నాలుగు చేతుల్లో రెండింటిలో తామర పువ్వులను పట్టుకుని ఉండగా, మరో రెండు చేతుల నుంచి బంగారు నాణేలు పడుతున్నట్లుగా ముద్రించారు. దీనిపై సంస్కృత పదమైన 'నిష్కా'ను ముద్రించారు.

# సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తా



మల్లాడి కృష్ణారావు

**యానాం:** రీజెన్సీ యాజమాన్యం తమకున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రీజెన్సీ పరిశ్రమ పునఃప్రారంభానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఉన్నతాధికారులు అడ్డు తగులుతున్నారని, అందుకే ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నామని ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పడం చాలా బాధాకరమన్నారు. యానాంలోనే రీజెన్సీ పరిశ్రమ ఉండాలని తాను కోరుకుంటున్నానన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇప్పటివరకూ యాజమాన్యం తన దృష్టికి తీసుకు రాలేదన్నారు. గతంలో ఫ్యాక్టరీ నడిచేటప్పుడు కార్మికుల సమ్మె విషయంలో సైతం తాను మధ్యవర్తిగా ఉండి సమస్యను పరిష్కరించానన్నారు. ఏడెనిమిదేళ్లుగా ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీ సమస్య తీరిందని, ఫ్యాక్టరీ తెరుస్తారని భావిస్తున్న తరుణంలో ఈ విధమైన నిర్ణయం బాధాకరమన్నారు. విద్యుత్ బకాయిలు, మున్సిపాలిటీకి సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని సంస్థ ఎండీ జీఎస్ నాయుడుకు పత్రికాముఖంగా చెబుతున్నానన్నారు.

### విద్యార్థినికి రూ.65 వేల సాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి వినోద్

**మామిడికుదురు:** మగటపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని శ్యామ ప్రసన్నకు ఆదివారం నామన ఫౌండేషన్ ద్వారా రూ.65 వేల ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ నామన వినోద్ ఈ చెక్కును విద్యార్థినికి అందజేశారు. ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ అడబాల సాయిబాబు, నామన రమేష్, తిరుమల సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

### పీచు బొమ్మల తయారీకి ప్రోత్సాహం

**మామిడికుదురు:** కొబ్బరి పీచు బొమ్మల తయారీకి మరింత ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పాశర్లపూడి గ్రామంలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని కోనసీమ కొబ్బరి పీచు బొమ్మల తయారీ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పీచు బొమ్మలు పర్యావరణ అనుకూలమైనవని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అవి దోహద పడతాయన్నారు. వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పీచు బొమ్మల తయారీ విధానాన్ని అసోషియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం మంత్రికి వివరించారు.

### ఒంటెలపై అమారీల ఊరేగింపు

**మామిడికుదురు:** ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం (అమరత్వం పొందిన 40వ రోజు) అర్బయీన్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఒంటెలపై అమారీలను ఊరేగించారు. దీనిలో భాగంగా స్థానిక ఇమామ్ రజా పంజా నుంచి నగరం మంజీలే కర్బలా వరకు అమారీలను ఊరేగించారు. మర్షియా ఆలపించారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులను బందీఖానా నుంచి విముక్తులను చేసిన ఘట్టాలను ముస్లింలు స్మరించుకున్నారు. మత ప్రబోధకుడు మహ్మద్ ఇబ్రహీమ్ మజ్లిస్ ఆలపించారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలో మజ్లిస్ జరిగింది. దీంతో పాటు హజరత్ ఇమామ్ హుస్సేన్ పంజాలో కూడా మజ్లిస్ జరిగింది. ఈ పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పలు భక్త బృందాలు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశాయి.

# ఆగస్ట్ 31 వరకూ క్రీడా సంబరాలు

**అమలాపురం రూరల్:** హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ వరకూ క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. అంబేడ్కర్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జీఎంఎంసీ బాలయోగి స్టేడియంలో 26న క్రీడాకారుల చేత ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న 18–40, 40–60 ఏళ్ల వయసున్న క్రీడాకారులకు వివిధ క్రీడల్లో పోటీలు, 28న చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 29న 3కే రన్, అత్యుత్తమ క్రీడాకారులకు సత్కార కార్యక్రమం ఉంటాయన్నారు. 30, 31 తేదీల్లో వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐక్యత, సృజనాత్మకత క్రీడా చిత్రాలు, లఘుచిత్రాలు, వ్యాసరచన, చిత్రకళల ప్రదర్శన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలోని క్రీడాకారులు, క్రీడా సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాలు పాల్గొని క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 79933 29433 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



చిన్ని కృష్ణుని వేషధారణ పోటీల విజేతలు

ఉట్టి కొట్టిన చిన్నారి కృష్ణులు



అమలాపురంలో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణులు

**అమలాపురం టౌన్:** జిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో స్థానిక గీతా విద్యాలయం ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. ఐదేళ్లలోపు బాల బాలికలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. సంస్కార భారతి జిల్లా స్థాయిలో నిర్వహించిన చిన్ని కృష్ణుని వేషధారణ పోటీల్లో దాదాపు 150 మంది బాలబాలికలు పాల్గొని తమ బుడి బుడి అడుగులతో చిన్ని కృష్ణుడు నడిచి వస్తున్నట్లుగా అభినయం చేసి సందడి చేశారు. పోటీల్లోని విజేతలైన చిన్నారులకు సంస్కార భారతి జిల్లా ప్రతినిధుల బహుమతులు ప్రదానం చేశారు. సంస్కార భారతి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు వేదనభట్ల సాయి లక్ష్మి, శ్రీగిరి పద్మావతి, గోకరకొండ బలరామ కృష్ణ గోవిందం, యర్రమిల్లి అనంతలక్ష్మి, శ్రీదేవి, గోపాలకృష్ణలు విజేతలకు బహుమతులు, శ్రీకృష్ణ చరిత పుస్తకాలు అందజేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి జగదీష్ విజేతలకు వెండి డాలర్లు బహూకరించి ప్రోత్సహించారు. చిన్ని కృష్ణుని వేషధారణ పోటీల విజేతల వివరాలను సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ వెల్లడించారు. జూనియర్స్ విభాగంలో గంటా కుశీల్, పెండి విష్ణువర్ధన్, లంకలపల్లి శ్రీనంద వేదాంత మొదటి మూడు స్థానాలను, సీనియర్స్ విభాగంలో కె.దుర్గా నాగశ్రీ, వి.షణ్ముఖ్, ఎల్‌వీ ప్రణయ్ మొదటి మూడు స్థానాలను కై వసం చేసుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను సీహెచ్ హర్షిత, ఎన్.యతిశ్రీ, ఎ.జత్విక్‌లు గెలుచుకున్నారు. కోలాటం పోటీల్లో ప్రత్యేక బహుమతిని ఎం.మౌనిషా సాధించింది.

# విగ్రహాల ఏర్పాటుపై వివాదం



రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

**అమలాపురం రూరల్:** మండలంలోని రెడ్డిపల్లిలో వంతెన వద్ద బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటుపై వివాదం చోటుచేసుకుంది. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటుచేశారంటూ కొంతమంది అభ్యంతరం చెప్పడంతో శనివారం రాత్రి అధికారులు విగ్రహాలను తొలగించారు. దీనిపై రెడ్డిపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాలను అపహరించుకుపోయారంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. తాము ఏర్పాటుచేసిన విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ఉంచేవరకూ ఆందోళన కొనసాగిస్తామంటూ వీధి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలో రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆందోళనకారులతో చర్చలు జరపడంతో వివాదం ముగిసింది.

# మహా సంప్రోక్షణ ఉత్సవాలు



గుమ్మిలేరులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం

**ఆలమూరు:** మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి 28 వరకు మహా సంప్రోక్షణ నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం గ్రామానికి చెందిన రెడ్డి వెంకట్రావు కుటుంబసభ్యులు నిర్మించిన ఈ ఆలయం ఇటీవల పునర్నిర్మాణం చేపట్టారు. రూ.40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావడంతో స్వామికి మహా సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా ఈనెల 26, 27, 28 తేదీల్లో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించనున్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి గుమ్మిలేరు గ్రామానికి చెందిన వంకవీర వెంకట సత్యనారాయణ మూర్తి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 28న సంప్రోక్షణ అనంతరం స్వామికి కల్యాణోత్సవం తదుపరి భారీ అన్న సమారాధన నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. గుమ్మిలేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

# అభివృద్ధి కోసం ప్రధానిని ఎప్పుడైనా కలవవచ్చు

**యానాం:** పుదుచ్చేరి అభివృద్ధి కోసం ప్రధానిని సీఎం రంగసామి ఎప్పుడైనా కలవొచ్చని రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రంగసామి పుదుచ్చేరి అభివృద్ధి కోసం మాట్లాడేందుకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా ఇళ్ల తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. స్టేట్‌హుడ్‌పై నిరంతరం తాము డిమాండ్ చేస్తున్నామని, ఇప్పటికే తాను రాజ్యసభలో సైతం దాని గురించి మాట్లాడానన్నారు. అయితే తగిన పరిస్థితులు ఏర్పడినప్పుడు తప్పనిసరిగా స్టేట్‌హుడ్‌ను కేంద్రం మంజూరు చేస్తుందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఇప్పటివరకూ ఎమ్మెల్యేలెవరూ ఫిర్యాదు చేయలేదని, వారి నియోజకవర్గాల సమస్యలపైనే తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి తాము వ్యతిరేకంగా లేమన్నారు.